





కామారెడ్డి జిల్లా ఉండాలో.. పోవాలో..

ప్రజలే తేల్చుకోవాలి

- రేవంత్‌రెడ్డి జిల్లాను తొలగిస్తానంటున్నాడు
- బీఆర్‌ఎస్ ఎంపీలు గెలిస్తే ప్రభుత్వాన్ని నిలదీస్తారు
- కామారెడ్డి ఉద్యమాల గడ్డ
- బీజేపీ ఎమ్మెల్యే గెలిచాడు కదా ఖాతాలో జన్‌ధన్ నిధులు పడ్డాయా?
- మోదీ 150 హామీలు ఇచ్చి ఏ ఒక్కటి నెరవేర్చలేదు
- కామారెడ్డి రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్

కామారెడ్డి, మే 7(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా ఉండాలో.. పోవాలో.. అని ప్రజలను మాజీ సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి కొత్త జిల్లాలను తొలగిస్తానని చెబుతున్నాడు. జిల్లాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. జిల్లా ఉండాలా లేదో ప్రజలే తేల్చుకోవాలన్నారు. కామారెడ్డి జిల్లా ఉండాలంటే ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపిస్తే ప్రభుత్వాలపై కొట్లాడుతారని అన్నారు. కామారెడ్డి ఉద్యమాల గడ్డ అని కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇక్కడి ప్రజల ఉద్యమం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం కానిస్టేబుల్ కిష్టయ్య ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. అలాంటి పోరుగడ్డ కామారెడ్డి ప్రజలు కొత్త జిల్లాను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి కేసీఆర్ బస్సు యాత్ర మంగళవారం రాత్రి చేరుకుంది. కామారెడ్డి నిజాంసాగర్ చౌరస్తా నుంచి ప్రభుత్వ ఆసుపత్రి, ఇందిరా గాంధీ చౌరస్తా, మాయాబజార్ మీదుగా భారీ ర్యాలీగా రోడ్‌షోతో జేపీఎన్ చౌరస్తా వరకు సాగింది. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ మాట్లాడారు.

బీజేపీ ఎమ్మెల్యే గెలిచాడు కదా.. జన్‌ధన్ నిధులు పడ్డాయా?

జన్‌ధన్ యోజన ఎవరికైన ప్రయోజనం అయిందా అని కేసీఆర్ ప్రశ్నించారు. జన్‌ధన్ యోజన కింద అకౌంట్లలో పేద ప్రజలకు రూ.15 లక్షలు వేస్తానని మోదీ చెప్పాడని మరి కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే గెలిస్తే మోదీ 30లక్షలు అకౌంట్లలో వేశాడా అని ప్రజలను కేసీఆర్ అడిగారు. కామారెడ్డి ప్రజల ఖాతాలో జన్‌ధన్ నిధులు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. దేశంలో, రాష్ట్రంలో అసమర్థులు.. తెలివి తక్కువ వారు రాజ్యమేలుతున్నారని మాజీ సీఎం కేసీఆర్ మండిపడ్డారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ లాంటి అసమర్థపాలకుడి వల్ల అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ట మంట కలిసిందని, రూపాయి విలువ తగ్గిపోయిందని ఆరోపించారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో దేశం ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. ప్రధాని మోదీ ఇప్పటి వరకు 150 హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ అంటున్న నరేంద్రమోదీ దేశాన్ని సబ్ కా సత్తెనాష్ చేశాడని దుయ్యబట్టారు. మరో వైపు రాష్ట్రంలో అరచేతిలో వైకుంఠాన్ని చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డి తెలివి తక్కువ పనులతో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని మండిపడ్డారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తుందన్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు పథకాలకు నోచుకోవడం లేదన్నారు. కరెంట్ కోతలు, మంచినీటి సరఫరా బంద్ అయిందన్నారు. 5 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం లూటీలకు పాల్పడుతుందని కేసీఆర్ విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. మేకింగ్ ఇండియా, డిజిటల్ ఇండియా అన్నాడు కానీ ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పిన మోదీ ఎక్కడికి పోయాడని నిలదీశాడు. తెలంగాణకు రావాల్సిన కృష్ణ, గోదావరి జలాలను సైతం రాకుండా మోదీ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. ప్రధాని మోదీకి ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఎప్పుడు కూడా ప్రజల మధ్య చిచ్చులు పెట్టడం, మత రాజకీయాలు చేయడం తప్ప అభివృద్ధి, పేదల సంక్షేమం పట్టదని మండిపడ్డారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు రావడం ఖాయమని ప్రధాని మోదీతో పాటు బీజేపీ ప్రతినిధులు చెబుతున్నారని మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం 400లు పెరగడం గ్యారెంటీ అని కేసీఆర్ అన్నారు. కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని అన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏకు 200ల సీట్లు కూడా దాటవన్నారు. జహీరాబాద్ లోక్‌సభలో బీజేపీ మూడో స్థానంతో సరి పెట్టుకోవడం ఖాయమన్నారు.

రైతు భరోసాను కాంగ్రెస్సే ఆపించింది

రాష్ట్రంలోని మిగిలిన రైతులందరికీ రెండు రోజుల్లోగా రైతు భరోసా నిధులను జమ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేసి ఎన్నికల కమిషన్‌కు వారే ఫిర్యాదు చేసి రైతు భరోసాను ఆపించారని మాజీ సీఎం కేసీఆర్ ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ హామీలు చెప్పి ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేకపోయిందన్నారు. కల్యాణలక్ష్మీ కింద తులం బంగారం, రైతు భరోసా కింద పెట్టుబడి సాయం, నష్ట పరిహారం, పండించిన పంటకు బోనస్ అని చెప్పి బోగస్ చేసిందన్నారు. రెండు లక్షల రుణ మాఫీ చేస్తానని చెప్పి కాలం వెల్లదీస్తున్నారన్నారు. 9 సంవత్సరాల పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రెప్పపాటులో కూడా కరెంటు పోలేదని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంటు కోతలు మొదలయ్యాయని అన్నారు. రైతుల పంటలు ఎండిపోతున్నాయని పరిశ్రమలకు విద్యుత్ సరఫరా కాక మూత పడుతున్నాయన్నారు. వెయ్యి కోట్ల పెట్టుబడి పరిశ్రమ కరెంటు కోతలతో తెలంగాణకు రాకుండా మద్రాస్‌కు తరలిపోయిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన కరెంటు ఇప్పుడు కాంగ్రెస్ ఎందుకు ఇవ్వడం లేదని ఆ కరెంటు అంతా ఎక్కడికి పోతుందని కేసీఆర్ ప్రశ్నించారు. కనీసం ప్రజలకు మంచి నీటిని కూడా సరఫరా చేయలేకపోతున్న అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. ఆడ బిడ్డలకు రూ.2500లు ఇస్తానని వారిని మోసం చేశారని అన్నారు. కనీసం ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు నాణ్యమైన భోజనం కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని 120 ప్రభుత్వ పాఠశాలల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని అన్నారు. 5 నెలల్లోనే ఇంత అసమర్థపాలన చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. పింఛన్లు రూ.4000లు ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ కనీసం రూ.2వేలు కూడా ఇవ్వడం లేదన్నారు. ఆడ పిల్లలకు స్కూటీ ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ స్కూటీలు కాదుకదా లూటీలు మొదలుపెట్టిందని ఆరోపించారు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతుందన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు రావనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ఏ జిల్లాకు వెళితే అక్కడి దేవుళ్లపై ఒట్లు వేస్తున్నాడన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం లేకపోవడంతోనే సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేస్తున్నాడని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్లు వేయడం కేసీఆర్‌ను తిట్టడం తప్ప రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ పాలన చేతకాదని ఆరోపించారు. జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ కామారెడ్డి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, సురేందర్, హన్మంత్ షిండే, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పిప్పిరి వెంకటి, కుంబాల రవి, లక్ష్మీనారాయణ, పిట్ల వేణు, శ్రీనివాస్ గౌడ్, బలవంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల
అటానమస్‌లో అడ్మిషన్లు ప్రారంభం

బిచ్కుంద, మే 7: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంపీసీ, బీజడ్‌సీ, కంప్యూటర్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మే 6వ తేది నుంచి 25వ తేదీ వరకు దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవా లని తెలిపారు. బీఏ అడ్మిషన్ల కోసం 94927 95524, బీఎస్సీ కోసం 94900 07424, బీకాం అడ్మిషన్ల కోసం 97011 55512నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

కామారెడ్డి టౌన్, మే 7: కామారెడ్డి జిల్లాలో గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. 45 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఆయా మండలాలను రెడ్‌జోన్‌గా ప్రకటించారు. అయితే మంగళవారం మాత్రం స్వల్పంగా ఉష్ణోగ్రతలు తగ్గాయి. బిచ్కుందలో 44.7, ముక్కుంపూర్ 44.0, కొల్లూర్ 43.6, పిట్లం 43.6, బీర్కూర్ 43.4, హసన్‌పల్లి 43.1, మేనూర్ 42.7, నస్రూల్లాబాద్ 42.4, సోమూర్, బొమ్మన్ దేవాయిపల్లి 42.1, భిక్కనూర్ 42.0, గాంధారి 41.9, జుక్కల్, పెద్దకొడప్‌గల్ 41.8, దోమకొండ, లింగంపేట, పాత రాజంపేట, మాచాపూర్‌లలో 41.7, డోంగ్లీ 41.5, పుల్కల్ 41.4, రామారెడ్డి 41.3, సర్వాపూర్, సదాశివనగర్ 41.0, ఎల్పుగొండ 40.8, నాగిరెడ్డిపేట 40.6, రామలక్ష్మణ్‌పల్లి 40.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

13న వేతనంతో కూడిన సెలవు దినం

కామారెడ్డి టౌన్, మే 7: ఈనెల 13న లోక్‌సభకు జరగనున్న పోలింగ్ సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొనుటకు రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవుదినంగా ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రభుత్వేతర కార్యాలయాలకు, సంస్థలకు సెలవు వర్తిస్తుందని తెలిపారు. కాగా పోలింగ్ కేంద్రాలుగా, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలుగా ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఉపయోగిస్తున్న విద్యా సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు ఈనెల 12న ఆదివారం సెలవు దినంగా ప్రకటించిందని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు ఎలాంటి అవాంతరాలు జరగకుండా, ఓటరు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు వేయుటకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఓటరు కూడా బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ ఆధ్వర్యంలో గత రెండు, మూడు నెలలుగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కాల భైరవస్వామికి ప్రత్యేక పూజలు

రామారెడ్డి, మే 7: రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి - రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన కాల భైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య భైరవునికి క్షీరాభిషేకం, సిందూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఈవో ప్రభురాంచంద్రం గుప్తా తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి పూజలు నిర్వహించిన దృశ్యం

ప్రతీ పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మే 7: భవిష్యత్తును తీర్చిదిద్దే ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతీ పౌరుడు వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవా రం కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియ జేయడానికి 5కే రన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ రన్ కొత్త బస్టాండ్ మీదుగా ఇందిరాగాంధీ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం వంటిదని తప్పనిసరిగా ఓటు హక్కు కలిగిన ప్రతీ వ్యక్తి ఓటు వేయాలని తెలిపారు. నేను ఖచ్చితంగా ఓటు వేస్తానని సంకల్పంతో ప్రతీ పౌరుడు పోలింగ్ కేంద్రానికి వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికలు ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయడానికి ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించిందని వెల్లడించారు. జాతి, కులం, మతాలకతీతంగా పౌరుడు తమ ఓటు హక్కును వినియోగించుకుని కీలకపాత్ర పోషించాలని సూచించారు. పోలింగ్ రోజున వృద్ధులు, దివ్యాంగులను ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చి, తిరిగి పంపించేందుకు రవాణా సదుపాయం కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ 5కే పరుగులో స్వీప్ నోడల్ అధికారి వెంకటేశం, జిల్లా అధికారులు నాగరాజు, వెంకట్‌రెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

పనులను పాఠశాలలు తెరిచేలోపు పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనులను పాఠశాలలు తెరిచేలోపు పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం టెక్రియాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, మున్సిపాలిటీ నర్సరీని, టెక్రియాల్ చౌరస్తాలో ఉన్న అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు పురోగతిని పరిశీలించి పాఠశాలలో చేపడుతున్న మరమ్మతు, ప్రహరీ మరమ్మతు పనులు టాయిలెట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ నర్సరీలో పెంచుతున్న వట్టివేరు మొక్కలను పరిశీలిస్తూ ఔషధ గుణాలు కలిగిన ఈ మొక్క ప్రాశస్త్యం పట్ల ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. ఈ మొక్కను చెరువుకట్టలపై పెంచడం వల్ల చెట్టు వేర్లు 10, 15 అడుగుల వరకు కిందికి వెళ్లి బుంగ పడకుండా కట్టబలంగా ఉంటుందని తెలిపారు. అనంతరం టెక్రియాల్ చౌరస్తాలో గల అంతర్ జిల్లా చెక్‌పోస్టును సందర్శించి స్టాటిక్స్ సర్వేలైన్స్ బృందంతో మాట్లాడుతూ ప్రతీ వాహనాన్ని నిశితంగా తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు సుబ్బారాయుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

11న కామారెడ్డికి ప్రియాంకగాంధీ రాక



మాట్లాడుతున్న ఏఐసీసీ సెక్రెటరీ విష్ణునాథ్

కామారెడ్డి టౌన్, మే 7: ఈనెల 10న కామారెడ్డిలో జరగాల్సిన ప్రియాంకగాంధీ సభ 11వ తేదీకి మార్చబడిందని ఏఐసీసీ సెక్రెటరీ విష్ణునాథ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని క్లాసిక్ గోల్డెన్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ప్రియాంకగాంధీ సభను విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ నియంతపాలనను అంతమొందించి ఇంద్రమ్మ రాజ్యాన్ని తీసుకువద్దామని తెలిపారు. రిజర్వేషన్లు మనకు దక్కకుండా మనువాదుల కుట్ర జరుగుతుందని తెలిపారు. భారీ ఎత్తున యువత తను తరలించి ప్రియాంక గాంధీ ఇచ్చే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. యువత తలుచుకుంటే సాధ్యం కానిదిఏది లేదని అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీని తప్పకుండా గెలిపించుకుని మన రిజర్వేషన్లు కాపాడుకుందామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ సలహదారుడు షబ్బీర్‌అలీ మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్నో అడ్డంకులు సృష్టించి పెన్షన్లు మిగిలిన వారికి రైతుబంధు, పంట నష్టపరిహారం రైతులకు అందకుండా అడ్డంకులు సృష్టించారని తెలిపారు. ఇందిరమ్మ ప్రతీ రూపమైన ప్రియాంకగాంధీ కామారెడ్డికి వచ్చేస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ గ్రామాల నుంచి భారీగా తరలిరావాలని తెలిపారు.

పేరుకే.. క్రీడా ప్రాంగణాలు!

- కేవలం బోర్డులకే పరిమితం
- చాలా గ్రామాల్లో నిరుపయోగంగా పరికరాలు
- ముళ్లపొదలు, పిచ్చి చెట్లతో అధ్వానంగా క్రీడా ప్రాంగణం
- పట్టించుకోని అధికారులు

భిక్కనూరు, మే 7: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి, క్రీడాకారులు సాధన చేసేందుకు, ఆటలతో ఆరోగ్యమైన జీవితం అందించాలనే లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గ్రామగ్రామాన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి వీటిని ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో శుభ్రం చేయించి, ఈ క్రీడా ప్రాంగణంలో పలు క్రీడలకు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేసి అప్పటి ప్రజాప్రతినిధులతో ఆడంబరంగా ప్రారంభించారు. క్రీడాకారులకు ఎంతో సహాయంగా ఉంటాయని భావిస్తే ఆ క్రీడా ప్రాంగణాలపై ప్రజాప్రతినిధులు గానీ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం భిక్కనూరు మండలంలో పిచ్చిచెట్లు, ముళ్ల పొదలు మొలకెత్తి వనంలా తయారయ్యాయి. కాగా చాలా గ్రామాల్లో క్రీడలకు అనువుగా లేని స్థలాల్లో ఏర్పాటు చేయడం, అనువుగా ఉన్న స్థలాల్లో సరైనా వసతులు కల్పించకపోవడంతో ఈ క్రీడా ప్రాంగణాలు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. కాగా చాలా గ్రామాల్లో ఈ క్రీడాప్రాంగణాలు గ్రామానికి దూరంగా ఉండటంతో ఆటలకు అనుకూలంగా లేవనే విమర్శలు ఉన్నాయి.

కేవలం బోర్డులకే పరిమితం

మండలంలో వేల రూపాయలు ఖర్చు పెట్టి గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి అందులో వ్యాయామ, వాలీబాల్, ఖోఖో, తదితర క్రీడల కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం తరుపున ఈ క్రీడాకారులకు సైతం వాలీబాల్, క్రికెట్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, బ్యాడ్మింటన్, తదితర క్రీడలకు సంబంధించి క్రీడాపరికరాలు, సామగ్రి, డ్రెస్సులను అందజేసింది. వాటిని కూడా గ్రామ పంచాయతీ అధికారులు క్రీడాకారులకు అందించకుండా గ్రామ పంచాయతీల్లోనే భద్రపరిచారు. ప్రస్తుతం ఈ క్రీడా ప్రాంగణాల్లో పెద్దబోర్డు, వ్యాయామానికి సంబంధించిన కొన్ని పరికరాలు మాత్రమే ఉన్నాయి. క్రీడాకారులకు అందజేయాల్సిన క్రీడా సామగ్రిని, పరికరాలను చాలా గ్రామాల్లో ఇవ్వకుండా గ్రామ పంచాయతీల్లో భద్రపరచడంతో క్రీడల పట్ల ఉత్సాహం ఉన్న యువకులు ఈ క్రీడా ప్రాంగణాలకు వెళ్లడమే మానేశారు. క్రీడాకారులు, పోలీసు, ఆర్మీ సెలక్షన్ల కోసం సాధన చేసే యువకులు వెంచర్లు, ఖాళీ స్థలాలను ఆశ్రయిస్తున్నారు. నిజానికి ఒక్కో క్రీడా పాంగణం కనీసం రెండు ఎకరాల స్థలంలో ఈ ప్రాంగణాలు ఉంటే క్రీడాకారులకు క్రీడలు ఆడటానికి, ప్రతిరోజూ వాకింగ్ చేయడానికి అనువుగా ఉంటుంది. కానీ గ్రామాల్లో పావు ఎకరం, అరెకరం స్థలంలో ఈ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.

ముళ్లపొదలు, పిచ్చి చెట్లతో క్రీడా ప్రాంగణాలు

గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించి వారికి కావాల్సిన వసతులు కల్పించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు క్రీడా ప్రాంగణాల్లో సరైనా వసతులు కల్పించకపోవడంతో యువకులు, క్రీడాకారులు అక్కడికి వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. దీంతో ఈ క్రీడా ప్రాంగణాలు పిచ్చిచెట్లు, ముళ్ల పొదలు మొలకెత్తి వనంలా తయారయ్యాయి. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలకు వేసవి సెలవులు రావడంతో అక్కడక్కడా కొందరు యువకులు, చిన్నారులు ఈ క్రీడా ప్రాంగణంలో కొంత భాగాన్ని శుభ్రం చేసుకుని వాలీబాల్ ఆడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో పందులకు గుడారాలుగా మారుతున్నాయి. ఇప్పట్కైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి మంచి ఆశయంతో ప్రారంభించిన క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాలని యువత కోరుతుంది.

ఒక్కో క్రీడా ప్రాంగణానికి వేల రూపాయలు వెచ్చించారు

ప్రతీ గ్రామ పంచాయతీలో ఈ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు రూ.వేల రూపాయలను అప్పటి ప్రభుత్వం వెచ్చించింది. ఈ నిధులతో క్రీడా ప్రాంగణం ప్రారంభ బోర్డు, మొరానికి, మొరం చదునుకు, వాలీబాల్, ఖోఖో, వ్యాయామానికి సంబంధించిన పోల్స్, గేటు, తదితర పనులను చేపట్టారు. ప్రస్తుతం చాలా గ్రామాల్లో ఈదురు గాలులకు ప్రారంభ బోర్డులు పడిపోగా, పోల్స్ తదితర కారణాలతో చెడిపోయాయి.



భిక్కనూరులో క్రీడా ప్రాంగణం

క్రీడా పరికరాలను అందించాలి

- నరేష్, క్రీడాకారుడు

క్రీడా పరికరాలను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో భద్రపరిచారు. క్రీడా పరికరాలను ఇవ్వకపోవడంతో క్రీడా పాంగణానికి వెళ్లలేకపోతున్నాం. అధికారులు క్రీడా పరికరాలను క్రీడాకారులకు అందించి ప్రోత్సహించాలి. క్రీడా ప్రాంగణాన్ని చదును చేసి ఉపయోగంలోకి తీసుకురావాలి.

క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకురావాలి

- సందీప్, క్రీడాకారుడు.

క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి చెట్లు మొలకెత్తి అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి క్రీడా ప్రాంగణాల్లోని పిచ్చి చెట్లను తొలగించి ఉపయోగంలోకి తీసుకురావాలి. యువతను ప్రోత్సహించి క్రీడల్లో రాణించేలా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి.



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్



సమావేశానికి హాజరైన పద్మశాలీలు

పద్మశాలీలకు పెద్దపీట వేసింది కేసీఆరే

● బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పద్మశాలీలకు అండగా ఉన్నామని, అన్నివిధాలుగా ఆదుకున్నామని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం రాత్రి నిజామాబాద్ నగరంలో పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అప్పటి సీఎం కేసీఆర్ చేనేత కార్మికులను ఆదుకునేందుకు బతుకమ్మ చీరల తయారీకి సహకరించారన్నారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో పద్మశాలీ సంఘాల భవనాల కోసం కోట్లాది రూపాయల నిధులను అప్పటి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. బీడీ కార్మికులకు పెన్షన్ అందించిందన్నారు. హామీల పేరు మీద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చీరల తయారీని బంద్ చేసిందని ఆయన ఈ సందరంగా పేర్కొన్నారు. అన్ని పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కష్టాలు మొదలయ్యాయని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అన్నారు. కరెంట్ సక్రమంగా రాకపోవడం వల్ల పంటలు కూడా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా పరిశ్రమలకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోవడం వల్ల ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, ఎమ్మెల్సీ ఎల్వీ రమణ, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, నగర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గజ్జి టి వెంకట నర్సయ్య, ప్రధాన కార్యదర్శి ఎనగందుల మురళి, గుండయ్య, సత్యపాల్, పులగాం హన్మాండ్లు, యాదగిరి, ధర్మపురి పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోంది'

సదాశివనగర్, మే 7: కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతుందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దెల భాగయ్య అన్నారు. మంగళవారం పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల నరేంద్రమోదీ ప్రధానిగా ఉండి దేశ ప్రజలకు చేసిందేమి లేదని గతంలో ఇందిరాగాంధీ అందించిన ఇందిరమ్మ ఇళ్లు, పేదలకు భూములు, ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందే తప్ప నరేంద్రమోదీ చేసింది ఏమి లేదని దళితులంతా ఏకమై బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కవిన్, బాలరాజు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మద్దెల భాగయ్య



పొతంగల్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్

బీజేపీ మత రాజకీయాలను ఓటుతో ఎండగట్టాలి : సురేష్ షెట్కార్

కోటగిరి,మే7: బీజేపీ పార్టీ మతం పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందే ప్రయత్నం చేస్తుందని, ఈ ఎన్నికలలో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ పేర్కొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. పదేళ్ల పాలనలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. జహీరాబాద్ ఎంపీగా పని చేసిన బీబీపాటిల్ బిజినెస్ పాటిల్‌గా వ్యవహరించారన్నారు. బోధన్, బీదర్ రైల్వే లైన్ తాను సర్వే చేయించినట్లు పేర్కొన్నారు. ఆ ప్రాజెక్టు విషయంలో బీబీపాటిల్ ఏ మాత్రం స్పందించకపోవడంతో ప్రజల ఆశయాలు నెరవేరకుండాపోయ్యాయన్నారు. తనను ఆశీర్వదిస్తే బోధన్, బీదర్ రైల్వే లైన్‌తో పాటు మద్నూర్, రుద్రూర్ ఫోర్‌లైన్ రోడ్డు ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, నాయకులు హెగ్డోలి శంకర్, వీరేశం, పవన్, సునీల్ కుమార్, సాయరెడ్డి, గిర్ని రాజు, తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో గంగాధర్

ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పిస్తాం

నిజాంసాగర్, మే 7: ఉపాధి హామీ పథకం కింద బుధవారం నుంచి కూలీలకు పనులు కల్పిస్తామని ఎంపీడీవో గంగాధర్‌తెలిపారు. మంగళవారం నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు డబ్బులు రాలేవని, కూలీలు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. హుటా హుటీన ఎంపీడీవో గంగాధర్, ఏపీవో శ్రీనివాస్ చేరుకుని కూలీలతో మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రావాల్సిన డబ్బులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామంలో బుధవారం నుంచి ఉపాధి పనులు ప్రారంభం అవుతాయని, ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లో చేరాలని ఆయన తెలిపారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి మోహన్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మెట్లు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీ సెల్ జిల్లాఉపాధ్యక్షుడు నరేష్‌రాథోడ్

'గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలి'

బాన్సువాడ టౌన్, మే 7: తెలంగాణలో గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ రావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు నరేష్‌రాథోడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు 6శాతం నుంచి 10శాతం పెంచడంపై హైకోర్టులో శ్యాంసుందర్‌రెడ్డి కేసు వేయడం జరిగిందన్నారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకమని దీనిపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో రూప్‌సింగ్, రవి, శంకర్‌నాయక్, చంద్రజాదవ్, రవిచవాన్, బల్‌రాంసింగ్, ప్రశాంత్, సంగ్రాం, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్

నిజామాబాద్ అర్బన్, మే 7: ఆర్మూర్ జెమ్మన్ జెట్టి గల్లీకి చెందినా ప్రసాద్ అనే వ్యక్తి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులపై అనుచిత వాక్యాలు చేసినందుకు ప్రసాద్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్ చేయడం జరిగిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఇకపై ప్రసాద్‌కు కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదు. తన యొక్క కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం రద్దు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

ఇండియా కూటమిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూమన్న

ఆర్మూర్‌టౌన్, మే7: జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలోని బీడీ కార్మికులు ఇండియా కూటమిని గెలిపించాలని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బి.భూమన్న అన్నారు. మంగళ వారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఇండియా కూటమి అభ్యర్థులకు బీడీకార్మికులు మద్దతుగా నిలిచి వారి గెలుపులో బాగస్వామ్యం కావాలని అన్నారు. జిల్లాలో రెండు లక్షల మంది, తెలంగాణ వ్యాప్తంగా కోటి 50లక్షల మంది బీడీకార్మికులు ఉన్నారని వారంత ఏకతాటిపైకి వచ్చి ఇండి యా కూటమి అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూర్యశివాజీ, జిల్లా కార్యదర్శి జె.గంగాధర్, సహయకార్యదర్శి సుప్రి య, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

మెండోరా, మే7: మండలంలో బుస్సాపూర్ గ్రామానికి చెందిన కొలిప్యాక్ సౌందర్య సెల్ ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆది వా రం ఆర్టీసీ బస్సులో ఆర్మూర్ నుంచి తాను బుస్సాపూర్ గ్రామానికి వచ్చే సమయంలో సెల్‌ఫోన్ పోయిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో సీఈఐఆర్ యాప్ సహయంతో ఒకే రోజులో వెతకి బాధి తురాలి సౌందర్య సెల్‌ఫోన్ అప్పగించారు.పోలీసులకు బాధితురాలు ప్రత్యేక కృత జ్ఞతలు తెలి పారు.ఈకార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎండలు భగభగ.. విద్యుత్ మీటర్లు గిరగిరా

● రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. వాటికి పోటీగా పరుగులు పెడుతున్న విద్యుత్ వినియోగం ● సగానికి పడిపోయిన గృహజ్యోతి పథకం లబ్ధిదారుల సంఖ్య

కమ్మర్‌పల్లి, మే 7: ఎండలు రోజురోజుకు పెరుగుతున్న ఊష్ణోగ్రతలు ఉదయం 9 గంటలకే ఉక్కపోతలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. దీంతో పది ,పదకొండు దాటితే ఇండ్ల నుంచి బయటకు రాలేక ఇంటిపట్టునే ఉంటున్నారు. 40 డిగ్రీలుదాటి కొన్ని చోట్ల 50 చేరువలో ఎండలు దంచి కొడుతున్నాయి. సాయంత్రం 5 వరకు కూడ ఇంటి నుంచి బయటకురాక ఏమి తోచక టీవీలతో కాలక్షేపంతో పాటు చల్లదనం కోసం ఏసీలు, కూలర్లకు అతుక్కుపోతున్నారు. దీంతో మార్చి చివరి వారం నుంచే విద్యుత్ వినియోగం రోజు రోజుకు పెరుగుతువస్తోంది. ఇళ్లలో కరెంటు మీటర్లు గిర గిరా తిరుగుతున్నాయి. ఎండలు మండుతున్న వేళ విద్యుత్ వినియోగం పెరుగుతున్నప్పటికి విద్యుత్‌సరఫ రాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా సంబంధిత అధికారులు నిరంతర సరఫరాకు తగు చర్యలు తీసు కుంటుండడంతో జనాలు ఉక్కపోతల నుంచి కాస్త ఉపశమనం పొందుతున్నారు. ఏదైనా అత్యవసర పనులు ఉండి బయటకు వెళ్లాల్సి వస్తే యుద్ధప్రాతిపాదిక పనులు ముగించుకుని ఇళ్లకు చేరిపోతున్నారు. ఉపాధికూలీలు సైతం ఉదయం ఏడు గంటలను పను లకువెళ్లి 10 గంటలవరకు తిరుగు పయానమవుతున్నారు. కాగా పాఠశాలకు సెలవులు ఉండడంతో పిల్లలు ఇంటిపట్టునే ఉంటున్నారు. వారిని ఎండల్లో తిరగనీయకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

● విద్యుత్ వినియోగం పెరగడంతో తగ్గనున్న 'గృహజ్యోతి' లబ్ధిదారులు

రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచితవిద్యుత్‌ను గత ఫిబ్రవరి నుంచి అందిస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నవారిలో కొందరికి ఈ పథకం అమలు కాలేదు. కాని తదుపరి వారి దరకాస్తులను సవరణ చేయించుకోగా దాదాపు కొంత మంది లబ్ధిదారులకు మార్చి నెలలో 'గృహజ్యోతి' పథకం వర్తించింది. కాని మార్చి చివరి వారం నుంచి ఏప్రిల్ చివరి వరకు ఎండలు దంచి కొడుతుండడంతో బయట తిరగలేక ఇంటిపట్టునే ఉండడం, రాత్రి వేళల్లో వేడిని తట్టుకోలేక ఫ్యాన్‌లు, కూలర్లు ఏసీల వాడకం పెరిగిపోవడంతో గతనెలలో 'గృహజ్యోతి' లబ్ధిదారులు కరెంటు మీటర్లు గిరగిర తిరగడంతో 200 యూనిట్లు దాటిపోవడంతో 'గృహజ్యోతి' పథకానికి అనర్హులుగా మారుతున్నారు. కమ్మర్‌పల్లిలో గృహవిద్యుత్ వినియోగదారులు 6071 ఉండగా గత నెల 3269 మంది వినియోగదారులు 'గృహజ్యోతి' పథకాలని అర్హులయ్యారు. వీరికి రూ.12లక్షల39వేల4ల విలువగల ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందించింది.



ఎండలకు అధికలోడ్‌తో గిర్రున తిరుగుతున్న విద్యుత్ మీటర్

ఈ నెల మీటర్ల గిరగిరతో అందులో సగానికి పైగా లబ్ధిదారులు ఈ పథకాన్ని అనర్హులుగా మారవచ్చని సంబంధితశాఖ అధికారులుంటున్నారు. గత నెల రూ.3లక్షల45 20 యూనిట్లు గృహ, వ్యవసాయ ఇతరత్ర వినియోగం కాగా గృహ అవసరాలకు రూ. 2లక్షల 11 వేల 374 యూనిట్లు విద్యుత్ వాడకం అయ్యిదని, మే నెలలో సుమారు మరో లక్షన్నర యూనిట్లు పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకం తగ్గినప్పుడే వీరు తిరిగి 'గృహజ్యోతి'కానికి అర్హులవుతారు.

విద్యుత్ వింత..పరేషాన్

- ఒకే గ్రామానికి రెండు వైపులా విద్యుత్ సరఫరా
- ఒకే గ్రామంలో ఒక వైపున విద్యుత్ ఉంటే మరో వైపు బంద్
- అర్థం కాక అయోమయంలో ప్రజలు
- కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి సిద్ధమవుతున్న గ్రామస్థులు
- దోమకొండ సబ్ స్టేషన్ ముట్టడికి ప్రణాళికలో గ్రామస్థులు

దోమకొండ, మే 7:మండలంలోని గొట్టిముక్కుల అదో చిన్న పల్లెటూరు. అక్కడ 350 కుటుంబాలు గల గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. గత సంవత్సరాలుగా ప్రశాంతగానే ఉన్నటువంటి గ్రామస్థులకు ఈ మధ్య ఈ వింత సమస్య వారిని వెంటాడుతోంది.ఆ సమస్య నుంచి బయట పడేందుకు దోమకొండలోని సబ్‌స్టేషన్ ముట్టడితో పాటు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయుటకు గ్రామస్థులు సిద్ధమదుతున్నారు. ఆ గ్రామానికి గతంలో నుంచి దోమకొండ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సప్లయ్ ఉండేది. అయితే గత రెండు నెలల క్రితం సంగమేశ్వర్ గ్రామంలోని సబ్‌స్టేషన్ నుంచి స్థంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ లైన్ గొట్టిముక్కుల వరకు తీసుకువచ్చి గ్రామంలో ట్రాన్స్‌పార్మర్ కుడా ఏర్పాటు చేసి గత 15 రోజుల నుంచి విద్యుత్ సప్లయ్‌ను నూతనంగా ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ సంగమేశ్వర్ గ్రామం నుంచే వచ్చే విద్యుత్ హనుమాన్ ఆలయం నుంచి, ముదాం గల్లీ, ఎస్సీ కాలనీల వరకు బిగించారు. మిగాతా నూతన కాలనీతో పాటు వివిధ కాలనీల్లో దోమకొండ సబ్‌స్టేషన్ నుంచి సప్లయ్‌ని కొనసాగిస్తున్నారు. వచ్చే వరి కోతల సిజన్‌లో కూడా గ్రామంలో విద్యుత్ ఇలాగే సప్లై కొనసాగితే హార్వేస్టర్ చేసే సమయంలో రైతులు, డ్రైవర్లు విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ఎలాంటి నష్టం జరగకముందే ఉన్నాతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేదంటే సమస్య పరిష్కరం కోసం జిల్లా కలెక్టర్‌కు కూడా వినతిపత్రం ఇవ్వడానికి గ్రామస్థులు సిద్దమవుతున్నారు.



గొట్టిముక్కుల గ్రామ ముఖచిత్రం ప్రధాన రోడ్డు ఇదే..



నూతనంగా బిగించిన ట్రాన్స్‌ఫార్మర్ ఇదే..

● గ్రామంలో సగం ఊరు విద్యుత్ ఉంటే.. సగం ఊరికి విద్యుత్ బంద్

గ్రామంలో ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ముదాం గల్లీ, ఎస్సీ కాలనీలో విద్యుత్ బంద్ చేస్తున్నారు. అంటే 150 కుటుంబాలకు విద్యుత్ బంద్ చేస్తే మిగాతా కాలనీల్లో విద్యుత్ సప్లయ్ ఉంటుంది. హనుమాన్ ఆలయం పక్కనే ఒక వైపు విద్యుత్ ఉంటే మరో పక్కన విద్యుత్ ఉండటం లేదు. సంగమేశ్వర్ నుంచి వచ్చే విద్యుత్ ప్రతి రోజు ఉదయం గంట పాటు బంద్ చేస్తున్నారు. ఇందేంటని గొట్టిముక్కుల గ్రామస్తులు అడిగితే సంగమేశ్వర్‌లో ఉదయం నాలా నీటి కోసం ట్యాంక్‌ల నుంచి వచ్చే పైపులకు మోటర్‌లను పెడుతున్నారనే ఆలోచనతో విద్యుత్ బంద్ చేయడం జరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు. అయితే సంగమేశ్వర్‌లో బంద్ చేయడానికి గొట్టిముక్కులకు ప్రత్యేకంగా ఐండిల్ ఏర్పాటు చేసి వేర్వేరుగా లైన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని గొట్టిముక్కుల గ్రామస్థులు కొరుతున్నారు.

● ఇబ్బందులు పడుతున్న రైతులు

వ్యవసాయ బావుల వద్ద ఎదైన రిపేర్‌లు ఉన్న సమయంలో విద్యుత్ ఎల్‌సీ తీసుకోవాలంటే దోమకొండ, సంగమేశ్వర్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌లను సంప్రదించ వలసి వస్తుందని రెండు చోట్ల ఎల్‌సీ ఇస్తేనే తామ పనులు చేసుకోవడానికి ఆవకాశం ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సంగమేశ్వర్ సబ్‌స్టేషన్‌లో ప్రభుత్వ ఫోన్ నంబర్ సైతం అందుబాటులో లేదని గ్రామస్తులు చెపుతున్నారు. గతంలో లాగానే తమ మొత్తం గ్రామానికి దోమకొండ నుంచి విద్యుత్ సప్లయ్ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేదా పూర్తి స్థాయిలో సంగమేశ్వర్ గ్రామం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సప్లై ఇచ్చేవిధంగా చూసి, సంగమేశ్వర్‌కు, గొట్టిముక్కులకు వేర్వేరుగా ఐండిల్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కొరుతున్నారు. రైతులు తమ వ్యవసాయ బావుల వద్ద మరమ్మతులు చేయాలంటే రెండు వైపుల నుంచి ఎల్‌సీ తప్పనిసరి కానీ రెండు సబ్ స్టేషన్‌లలో ఒక్కసారి ఎల్‌సీ ఇవ్వడం కుదరడం లేదు ఎందుకంటే దోమకొండలో ఎల్‌సీ ఇస్తే సంగమేశ్వర్ సబ్‌స్టేషన్‌లో ఫోన్ కలువదు. అలా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ ఒకవైపు నుంచి ఎల్‌సీ వస్తే మరోవైపు నుంచి న్యూటల్ సప్లై గ్రామంలోని అంతట సప్లై కావడంతో మరమ్మతులు చేయడానికి వీలు కావడం లేదు. కాబట్టి గతంలో ఉన్నట్లే తమ గ్రామానికి దోమకొండ నుంచే లైన్ కలపాలని గ్రామస్థులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

త్వరితగతిన విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

గొట్టిముక్కుల గ్రామానికి దోమకొండ నుంచి సప్లై ఉన్నపుడు కరంట్ మంచిగా ఉండే.ప్రస్తుతం దోమకొండ, సంగమేశ్వర్ సబ్‌స్టేషన్‌ల నుంచి కరంట్ రావడం వలన ఎక్కడి కరంట్ బంద్ ఉందో, ఎక్కడి కరంట్ చాలు ఉందో తెలియడం లేదు. ఎదైనా వ్యవసాయ పని నిమిత్తం ఎల్‌సీ తీసుకోవాలంటే రెండు సబ్‌స్టేషన్‌లలో ఎల్‌సీ తీసుకోవాలసిన పరిస్థితి నెలకొంది. సంగమేశ్వర్ సబ్‌స్టేషన్‌లో ల్యాండ్ నంబర్ అందుబాటులో లేదు.రెండు వైపులా నుంచి విద్యుత్ రావడం వలన చాలా మంది ఇండ్లలో బుగ్గలు తక్కువ వెళుతురు, ఫ్యాన్‌లు తిరగడం లేదు. ఒక వైపు విద్యుత్ బంద్ ఉన్నప్పటికీ మరో వైపు న్యూటల్ సప్లై వస్తుంది. టీవీలు సైతం వస్తుపోతున్నాయి. తెలియని వారికి చాలా ఇబ్బందులు వస్తున్నాయి.జిల్లా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

-జి. హన్మంత్‌రావు, గొట్టిముక్కుల గ్రామస్థుడు

సంగమేశ్వర్‌కు ప్రత్యేక హ్యాండిల్ పెట్టాలి

ప్రతి రోజు ఉదయం కరంట్ పోవడం వలన ఇబ్బందులు ఎదుర్కోంటున్నాం. గొట్టిముక్కుల గ్రామానికి ఉదయం పూట కరంట్ తీసేయవలసిన అవసరం లేదు. సంగమేశ్వర్‌లో ఉదయం గంట పాటు తీయవలసి వస్తే సపరేటు ఐండిల్ బిగించి తమ గ్రామానికి విద్యుత్ బంద్ కాకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. ఒక వైపున విద్యుత్ బంద్ ఉన్నప్పటకీ మరో వైపు సప్లై ఉండే స్థంభాలకు న్యూటల్ సప్లై కావడం వలన ఒక వక్త్యికి విద్యుత్ షాక్ సైతం గురయ్యాడు.అప్రమత్తతతో ప్రమాదం నుంచి బయట పడ్డాడు.గ్రామానికి ఎదో ఒక వైపు నుంచి విద్యుత్ సప్లై ఇచ్చే విధంగా చూడాలి.అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.త

-రాయిపల్లి రాజిరెడ్డి గొట్టిముక్కుల

ఎన్నికల సిబ్బందికి సదుపాయాలు కల్పించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నిజామాబాద్ అర్బన్, మే 7: ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల సిబ్బందికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్‌లు మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో రికార్డు స్థాయిలో ఎండలు ఉండటం వల్ల పోలింగ్ బూత్‌లలో కూలర్లు ఏర్పాటు చేయాలని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో కూడా ఎక్కువ కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది వారి స్వస్థలాలకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేయాలని, చల్లని నీరు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా నిజామాబాద్ అర్బన్‌లో పనిచేసే సిబ్బందికి భోజన సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేశామని వచ్చే పార్లమెంట్ ఎన్నికలను కూడా విజయవంతంగా పూర్తి చేసేందుకు పీఆర్‌టీయూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని కావున పోలింగ్ సిబ్బందికి సరైన వసతులు కల్పించాలని కోరారు.

డిచ్‌పల్లిలో వాహనాల తనిఖీలు



డిచ్‌పల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి, మే 7:మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బస్టాండ్ ప్రాంగణంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. పలు వాహనాల కారు డిక్కిలను తెరిచి ఫ్లాయింగ్ స్క్వాడ్ అధికారులు రాజేశ్ కుమార్, ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు.

క్రీడల్లో రాణిస్తే విజయం తథ్యం



సాఫ్ట్‌బాల్ శిక్షణలో పాల్గొంటున్న క్రీడాకారులు వీరే..

డిచ్‌పల్లి, మే 7: క్రీడకారులు వేసవి శిక్షణ శిబిరం క్రమ శిక్షణ తో సద్వినియోగం చేసుకుంటే విజయం తథ్యమని జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ ముత్తెన్న అన్నారు. మంగళవారం మండలంలోని మిట్టపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో కొనసాగుతున్న వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. క్రీడకారులు జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి మంచి ఫలితాలు రాబట్టడం అభినందనీయమన్నారు. సాఫ్ట్‌బాల్ క్రీడల్లో మెళుకువలు నేర్చుకొని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనలన్నారు. ఈ సందర్భంగా క్రీడకారులకు క్రీడ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కబ్బడీ కోచ్ ప్రశాంత్, సురేశ్, సాఫ్ట్‌బాల్ శిబిరం కోచ్ మర్కంటి గంగా మోహన్, జిల్లా కోచ్ అనికేత్, సీనియర్ క్రీడాకారుడు సెంథిల్, అంజలి, గంగాధర్, వినయ్, సాయిలు, పాల్గొన్నారు.

'ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు'

పెద్దబజార్, మే 7: ప్రజల్లో విద్వేశాలను ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం నగరంలోని అర్సపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎమర్జెన్సీని మించిన నియంతృత పోకడాలతో రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం లౌకిక విలువలమీద దాడి చేస్తున్నారని అన్నారు. మతాల పేరుతో, దేవుడి పేరుతో ప్రజల దృష్టిని మారుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుజాత, సిర్పలింగం, కటారి రాములు, నర్సయ్య, సూరి, మహేష్, గోవర్ధన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న దృశ్యం

చిరిగిన ఫ్లెక్సీలతో పొంచి ఉన్న ప్రమాదం

● ఈదురుగాలులకు ఏ వాహనదారుడిపై పడుతుందోనని భయం



ఆర్మూర్‌లో ఓ భవంతిపై చిరిగిన భారీ ఫ్లెక్సీ

ఆర్మూర్‌టౌన్, మే7: మున్సిపల్ పరిధిలోని పలు చోట్ల భవంతులపై ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలతో ప్రమాదం పొంచి ఉంది. ప్రధాన రోడ్డులోని భవంతులపై ఆకర్షణగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఇటీవల వీచిన ఈదురుగాలులతో ఫ్లెక్సీలు చిరిగిపోయి ఉండగా మున్సిపల్ అధికారులు వాటిని తొలగించాలి లేదా నోటీసులు జారీ చేయాలి.కానీచిరిగిన ఫ్లెక్సీలను పట్టించుకోకుండా అలాగే వదిలివేశారు. ఇటీవల చిరిగిన ఫ్లెక్సీ ఈదురుగాలులకు ఎగిరివచ్చి ప్రధానరోడ్డుపై వెళ్తున్న ఓవాహనదారుడిపై పడింది. అప్రమత్తమైన ఆ వాహన దారుడికి ప్రమాదవశాత్తు ఎలాంటి సంఘటన జరగలేదు.ఇప్పటి కైనా మున్సిపల్‌అధికారులు చిరిగినఫ్లెక్సీలనుతొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న డిగ్రీ కళాశాలల తనిఖీలు



బోధన్ ఉషోదయ డిగ్రీ కళాశాలలో తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లిమే 7: 2024-25 విద్యాసంవత్సరానికి అనుమతుల తనిఖీల్లో భాగంగా తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో అనుబంధ కళాశాలలు కొనసాగుతున్న మేధా డిగ్రీ(నవీపేట),ఉషోదయ(బోధన్),జీడీసీ(బోధన్), విజయ సాయి(బోధన్),ఎస్వీ(బోధన్) ఉషోదయ మహిళ (బోధన్), ఇందూ రు (బోధన్),ఎమ్ఐఎమ్ఎస్(బోధన్)ఇందూరు (బోధన్) డిగ్రీ కళాశా లలను మంగళవారం తెలంగాణ వర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. యూజీసీ, ఉన్నత విద్యా మండలి, తెలంగాణ విశ్వవిద్యాలయం నిబంధనల మేరకు ఈతనిఖీలు నిర్వహిస్తున్నమని, ప్రతీ కళాశాలలో ఉన్న వసతులపై తనిఖీలు చేస్తున్నట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు. జాయింట్ డైరెక్టర్ అతిఖ్ సుల్తాన గోరి, ప్రొ. ఆరతి, లావణ్య, రాంబాబు,ఆంనేయులు, పాల్గొన్నారు.

పసుపు బోర్డుపై స్పష్టత ఇవ్వాలి

● రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి

నందిపేట, మే7: గత ఎంపీ ఎన్నికల్లో బాండ్ పేపర్ అడ్డుపెట్టుకొని పసుపుబోర్డు ఏర్పాటు చేస్తానని రైతులను నమ్మబలికి ఎంపీగా గెలిచిన ధర్మపురి అర్వింద్ పసుపుబోర్డు ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సీడ్స్ కార్పోరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం నందిపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేఇన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పంట నష్టం జరిగితే కేంద్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తే రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి నష్టపరిహారం విడుదల చేసి రైతుల పక్షాన నిలిచిందని తెలిపారు. ఎంపీ అర్వింద్ రెచ్చగొట్టే వ్యాఖ్యాలు చేసి ఓట్లు రాబట్టాలని చూస్తున్నారని, ఇక నుంచి ఆటలు సాగవని, అన్వేష్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ సిఫారసు కమిటీ పేరిట మద్దతు ధర ఇవ్వడంలేదని, ఆ కమిటీ సిఫారసు మేరకు 2800పై చిలుకు మద్దతు ధర ఇవ్వాల్సి ఉండగా కేవలం 2200పై చిలుకు మాత్రమే ఇస్తుందన్నారు. దీంతో ఒక్కో రైతుకు క్వింటాలుకు 600పైన నష్టపోవాల్సి వస్తుందని సీడ్ కార్పోరేషన్ రాష్ట్ర చైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు వై.గంగాధర్, నిఖిల్, దమ్మాయి శ్రీనివాస్, ఎర్రం పోశెట్టి, మాన్పూర్ భూమేష్, కన్నె సాగర్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.



నందిపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు

బీభత్సం సృష్టించిన ప్రచార బెలూన్లు

సుభాష్‌నగర్, మే 7: ఈదురు గాలులకు వివిధ పార్టీలకు చెందిన ప్రచార బెలూన్‌లు బీభత్సం సృష్టించాయి. మంగళవారం నగరంలో సాయంత్రం భారీగా ఈదురు గాలులు వీచాయి. దీంతో ప్రచారం కోసం ఏర్పాటు చేసిన వివిధ పార్టీలకు సంబంధించిన బెలూన్‌లు కిందపడి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో ఓ పార్టీకి చెందిన బెలూన్, వినాయక్‌నగర్‌లో మరో పార్టీకి చెందిన బెలూన్‌లు విద్యుత్ తీగలకు తగిలాయి.



విద్యుత్ తీగలపై ప్రచార బెలూన్

పార్లమెంట్ ఎన్నికలపై అధికారుల సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లింగం

మోపాల్, మే 7: ఈనెల 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో లింగం అధికారులకు ఆదేశించారు. మంగళవారం మోపాల్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఎంపీడీవో లింగం ప్రత్యేక సమావేశం జరిపారు. ఈ సమావేశంలో పోలింగ్ బూత్‌ల వద్ద నీటివసతి, వీల్‌చైర్‌లు, టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రానికి తరలివచ్చిన సిబ్బంది

నేటితో ముగియనున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

మద్నూర్, మే 7: నియోజకవర్గంలో ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారు ఈ నెల 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ చేసుకోవడానికి అవకాశం ఉందని మద్నూర్ తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో 1006 మంది ప్రభుత్వ ఉద్యోగులు, బాన్సువాడ పరిధిలో 34మంది ప్రభుత్వ ఉద్యోగులు, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, అంథోల్ పరిధిలో 34 మంది, ఇతర నియోజకవర్గాల్లోని 37 మంది ఉద్యోగులు, 1077 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వేయాల్సి ఉండగా, 7వతేది వరకు 706 మంది వేసినట్లు వెల్లడించారు. మిగతా వారు రేపటి లోగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.


ఆలయంలో కీర్తనలు చేస్తున్న భక్తులు

పెద్దకొడప్‌గల్‌లో గోరో బాబా పుణ్యతిథి

పెద్ద కొడప్‌గల్, మే 7: పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో మంగళవారం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో సంత్ గోరోబా కాక పుణ్యతిథి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కీర్తనలు నిర్వహించారు. అనంతరం శాలివాహన సంఘం అధ్యక్షుడు యాదవ్ మాట్లాడుతూ సంత్ గోరోబా కాక తన జీవితంలో ఎన్నో ఆటంకాలు ఎదురైనా వాటిని ఎదుర్కొని దేనికి తలవంచక పాండురంగని నామస్మరణలో తేలియాడారని తెలిపారు. ఈ రోజుల్లో ప్రజలు దైవచింతనను మరిచి పోతున్నారని ఇది శుభసూచకం కాదని తెలిపారు. ఎవరైతే పాండురంగని సేవలో తరిస్తారో వారికి మోక్షం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం సభ్యులు సాయిలు, వీరేశం, పండరి, యాదగిరి, శివరాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


కూలీలు, అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగితే చర్యలు తప్పవు

రామారెడ్డి, మే 7: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని పోసానిపేట్ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న చెరువులో పూడికతీత పనులను పరిశీలించారు. ఎండల తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. విధులు సక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు అయ్యేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో సవిత, ఏపీవో ధర్మారెడ్డి, పోస్టల్ ఎస్‌పీఎం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


మద్నూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

మద్నూర్‌లో గడప గడపకూ కాంగ్రెస్ ప్రచారం

మద్నూర్, మే 7: మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. మద్నూర్ టౌన్ ఇన్‌చార్జీ బండి గోపి ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి సురేష్ శెట్కార్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో రమేష్, రాజు, రవి, లక్ష్మణ్, కుశాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంకగాంధీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

దోమకొండ, మే 7: కామారెడ్డిలో ఈనెల 11న జరిగే ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకగాంధీ బహిరంగసభను విజయవంతం చేయాలని దోమకొండ కాంగ్రెస్ నాయకులు కోరారు. జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మండల అధ్యక్షుడు అనంతరెడ్డిలు మాట్లాడుతూ ప్రియాంకగాంధీ బహిరంగసభకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు, కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు స్వామి, రామస్వామిగౌడ్, శ్రీకాంత్, నాగరాజురెడ్డి, నర్సారెడ్డి, శంకర్‌రెడ్డి, ఐరేని నర్సయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో మాజీ సర్పంచ్‌ల చేరిక

భిక్కనూరు: మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చంద్రకళ మాధవరెడ్డి, కుమ్మరి చంద్రం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరినట్లు పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారికి షబ్బీర్ అలీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనం

భిక్కనూరు ఆర్యవైశ్య సంఘం ప్రతనిధులతో మంగళారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ మాట్లాడుతూ వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కృషిచేస్తానని, నామినేటెడ్ పదవుల్లో ఆర్యవైశ్యులకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గజవాడ నాగరాజు, ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ హయాంలోనే జుక్కల్ అభివృద్ధి

పెద్ద కొడప్‌గల్, మే 7: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని పెద్ద కొడప్‌గల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోచారం, బేగంపూర్, కాస్లాబాద్, బేగంపూర్ తండాల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా జుక్కల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి చెందలేదని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచి అభివృద్ధిని విస్మరించిందని తెలిపారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో తిరిగి జుక్కల్‌లో అభివృద్ధి సాధ్యమయిందని తెలిపారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావ్ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కోట్ల రూపాయల నిధులు విడుదల చేశారని తెలిపారు. ఇక గతంలో జహీరాబాద్ ఎంపీగా పని చేసిన సురేష్‌కుమార్ షెట్కార్ హయాంలోనే నాలుగు వరుసల రహదారికి నిధులు మంజూరు అయిన విషయం గుర్తు చేశారు. ఈ లోకసభ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం పోచారం గ్రామానికి చెందిన సర్పంచ్ మానెవ్వ భర్త మొగులయ్య, బీఆర్‌ఎస్ మండల ప్రచార కార్యదర్శి అశోక్, గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చంద్రకాంత్‌తో పాటు 25 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, శ్యామప్ప, మోహన్, మల్లప్ప పటేల్, సంజీవ్, పండరి, రషీద్, రాంసింగ్, మొగులాగౌడ్, నాగు, రషీద్, బన్సిలాల్ తదితరులు పాల్గొన్నారు.


పోచారంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు


బీర్కూర్ తండాలో స్థానికులతో మాట్లాడుతున్న సుకుమార్

భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

● భారత్ జోడో అభియాన్ నేషనల్ ఇంచార్జి సుకుమార్

బీర్కూర్, మే 7: భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భారత్ జోడో అభియాన్ నేషనల్ ఇంచార్జి సుకుమార్ సూచించారు. మంగళవారం ఆయన బీర్కూర్ మండలంలోని చించోల్లి, బీర్కూర్ తండా, బరంగేడ్గి గ్రామాలలో పర్యటించారు. ప్రజలతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశం ఆర్థికంగా దెబ్బతిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయని, పేదలు, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజలు బాగా ఆలోచించి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జి రమణరెడ్డి, బాన్సువాడ ఇంచార్జి బేల్కోని రవి పాల్గొన్నారు.

రక్తదాతలను అభినందించిన డీఎస్పీ

బాన్సువాడ టౌన్, మే 7: ఏఎస్ఆర్ ఫౌండేషణ ఆధ్వర్యంలో రక్తదానం చేసిన దాతలను బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన దాతలకు సర్టిఫికేట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడిన వారమవుతామన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించిన ఏఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకుడు సంతోష్, రవి, సాయికుమార్, సురేష్, తదితరులున్నారు.

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే 7:దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాల హైదరాబాద్‌లో ప్రవేశం పొందాలనుకునే అనాథలు, ఇతర నిరాశ్రయులైన పిల్లలు, బాల గృహాల పిల్లలు, అక్రమ రవాణాకు గురైన పిల్లలు దరఖాస్తులు చేసుకోవచ్చని మహిళా శిశుసంక్షేమ, దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ అధికారి రసూల్‌బీ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు సుభాష్‌నగర్ అయ్యప్ప గుడి వద్ద గల బాలసదన్‌లో దరఖాస్తులను ఈనెల 15లోపు సమర్పించాలని ఆమె తెలిపారు. కుల, పదవ తరగతి, ఆదాయ, వికలాంగ సర్టిఫికెట్లను ఇతర స్టడీ సర్టిఫికెట్లను దరఖాస్తుతో జత చేయాలని ఆమె తెలిపారు.

పిరమిడ్ ధ్యాన మందిర నిర్మాణానికి భూమిపూజ

నవీపేట,మే7: మండలంలోని నాడాపూర్‌లో మంగళవారం మెగా పిరమిడ్ ధ్యాన మందిర నిర్మాణానికి పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు, అడ్వకేట్ సాయికృష్ణా రెడ్డి భూమిపూజ నిర్వహించారు. పీఎస్ఎస్ఎం వ్యవస్థాపకులు జగద్గురు బ్రహ్మర్షి పితామహ సుభాష్ పత్రీజీ ఆశయ సాధనలో భాగంగా ఈ ధ్యాన మందిరాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పిరమిడ్ ధ్యాన మందిరంలో ధ్యానం చేయడం వల్ల అనేక రుగ్మతలు నయం కావడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బినోల సోసైటీ మాజీ ఛైర్మన్ కిషోర్ రావు, సందీప్ రావు తదితరులున్నారు.

గుజరాత్ ప్రేరణ శిక్షణ శిబిరానికి విద్యార్థుల ఎంపిక

కామారెడ్డిటౌన్, మే 7: గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో జరిగే జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణ శిబిరానికి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థి బొల్లిగడ్డ అరుణ్‌కుమార్, జంగంపల్లి జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ విద్యార్థిని జువ్వాజి భావజ్ఞ ఈనెల 26 నుంచి 31 వరకు జరిగే శిక్షణ కార్యక్రమానికి ఎంపికయ్యారని తెలిపారు. ఏప్రిల్ నెల 10,23న జరిగిన జిల్లా స్థాయి ప్రేరణ పోటీలలో వీరిద్దరూ ప్రథమస్థానం సాధించి మొదటి బ్యాచ్ శిక్షణ శిబిరానికి ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రం నుంచి ఈ ఇద్దరు విద్యార్థులు ప్రాతినిధ్యం వహించడం విశేషమని తెలిపారు. ఆరురోజుల పాటు వాద్‌నగర్‌లోని జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమంలో ప్రాయోగిక విద్యవిద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి, భిన్నత్వంలో ఏకత్వం వికసిత్‌భారత్, విలువల ఆధారిత విద్యపై వీరికి శిక్షణ అందిస్తారని తెలిపారు.

నేడు నిజామాబాద్‌లో ట్రాఫిక్ మళ్లింపు

ఖిల్లా, మే 7: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటల నుండి సీఎం రేవంత్‌రెడ్డి పట్టణంలో రోడ్‌షో, కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో వాహనదారులు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్ రూట్లను దారిమళ్లిస్తున్నట్లు ఆయన తెలిపారు. పూలాంగ్ చౌరస్తా నుండి నగరంలోనికి వచ్చే వాహనదారులు ఆర్‌ఆర్ చౌరస్తా, వర్నిచౌరస్తా, బోధన్ బస్టాండ్, గాంధీ చౌక్ వరకు వెళ్లవచ్చని తెలిపారు. కంఠేశ్వర్ వైపు నుండి వచ్చే వాహనదారులు ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వేస్టేషన్, ఫ్లైఓవర్ నుండి బస్టేండ్‌కు వెళ్లవచ్చు. బోధన్ వైపు నుండి వచ్చే వారు అర్సాపల్లి రైల్వేగేటు మీదుగా కొత్త కలెక్టరేట్ వైపు నుండి ఖానాపూర్ ఎక్స్‌రోడ్, దుబ్బ చౌరస్తా, శివాజీచౌరస్తా, ఫ్లైఓవర్, ఆర్టీసీ బస్టాండ్ వరకు చేరుకోవాలి. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్ నుండి కొత్త కలెక్టరేట్, ఖానాపూర్ ఎక్స్‌రోడ్, దుబ్బ చౌరస్తా, శివాజీచౌరస్తా, ఫ్లైఓవర్, ఆర్టీసీ బస్టాండ్ వరకు, ఆర్మూర్‌వైపు నుండి వచ్చే వారు కంఠేశ్వర్ బైపాస్ నుండి కలెక్టరేట్, ఖానాపూర్ ఎక్స్‌రోడ్, శివాజీచౌరస్తా, బస్టాండ్‌కు చేరుకోవచ్చు. బాన్సువాడ నుంచి వచ్చేవారు వర్నిచౌరస్తా, ఖిల్లా చౌరస్తా, బోధన్ బస్టాండ్, అర్సాపల్లి రైల్వేగేట్ మీదుగా కలెక్టరేట్, దుబ్బ, బస్టాండ్‌కు చేరుకోవచ్చునని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

అబ్కారీ అధికారుల పర్యవేక్షణ కరువు

రెంజల్,మే7: మండలంలోని అన్ని గ్రామాలలో మద్యం ఏరులై పారుతున్న అబ్కారీ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మద్యం మాఫియాను పెంచి పోషిస్తున్న అబ్కారీ అధికారులు ఇకనైనా నిద్రమత్తు వీడి గ్రామాలలోని బెల్ట్ షాపులపై దాడులు జరిపి వాటిని నియంత్రించాలని మండల ప్రజలు వాపోతున్నారు. గ్రామాలలో మద్యం ఏరులై పారుతున్న అధికార యంత్రాంగం ఏం చేస్తున్నారని మద్యం వ్యాపారులు సిండికేటుగా మారి మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారని ఒక్కో క్వాటర్ బాటిల్‌పైన 10రూపాయల నుండి 20వరకు అదనంగా వసూలు చేస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

'కార్మికుల హక్కులను కాలరాశారు'

పెద్దబజార్, మే 7: దేశ స్వతంత్రానికి ము ందు తర్వాత కాలంలో కార్మికులు పోరాడి సా ధించుకున్నహక్కుల ను కాలరాశారని సీఐటీయూ జిల్లాకార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు అన్నారు. మంగళవారం నగరంలోని బీడీ ప్యాకింగ్ సెంటర్లలో బీడీ కార్మికులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సాయాగౌడ్, సాయిలు, మహ్మద్, మోహన్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగకుండా
ఓటు హక్కు వినియోగించుకోవాలి

సదాశివనగర్, మే 7: ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఇన్స్‌పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఐఎస్‌ఆర్‌డీ) ప్రతినిధి అమృత రాజేందర్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామ ఉపాధి హామీ కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం లాంటిందని ప్రతి ఒక్కరూ తమ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శివాజీ రావు, ఉపాధి క్షేత్ర సహాయకులు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

వెల్నెస్ ఆసుపత్రి వద్ద ఎల్లారెడ్డి వాసుల ఆందోళన

ఎల్లారెడ్డి, మే 7 : హైదరాబాద్‌లోని కొంపల్లి వెల్నెస్ ఆసుపత్రి వద్ద మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి చెందిన కొందరు ఆందోళన చేశారు. కల్యాణి గ్రామానికి చెందిన జగదీష్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి వెల్నెస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రిలో అధిక బిల్లు వేశారంటూ ఆరోపిస్తూ బిల్లుకట్టే వరకు శవాన్ని ఇవ్వమంటూ చెప్పడంతో మృతుని కుటుంబీకులు, బంధుమిత్రులు, ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు.

రేపు బాన్సువాడకు రక్షణ మంత్రి రాజనాథ్‌సింగ్ రాక

బాన్సువాడ టౌన్, మే 7: బాన్సువాడ పట్టణానికి గురువారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విచ్చేస్తున్నట్లు బాన్సువాడ బీజేపీ ఇన్‌చార్జి యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని అంగడిబజార్‌లో పార్టీ ముఖ్యులతో కలిసి సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విచ్చేస్తున్నారని, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలతో పాటు ఇతర నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. దేశం కోసం మోదీ, మోదీ కోసం మనం కదలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్దోళ్ల గంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, గంగాధర్, పైడిమల్ లక్ష్మీనారాయణ, మోతిపేట లక్ష్మారెడ్డి, కోనాల గంగారెడ్డి , పాశం భాస్కర్‌రెడ్డి, అశ్విన్, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

'దేశం, మోదీ కోసం మనం తరలి రావాలి'


ఉపాధి కూలీల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, మే 7: దేశం కోసం మోదీ.. మోదీ కోసం మనం తరలి రావాలని రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌గార్గే ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఉపాధి హామీ కూలీల చెంతకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు దేశానికి మోదీ అవసరం ఎంతో ఉందన్నారు. ప్రజలు అంతా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు , కార్యకర్తలు తదితరులున్నారు.

బీజేపీ నాయకుల ముమ్మర ప్రచారం

ఎల్లారెడ్డి, మే 7: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీతోనే పరిపాలన సాధ్యమని బీజేపీ కమలం పువ్వుకు ఓటు వేసి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి నరేష్‌లు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి మండలంలోని కొక్కొండ, అడవి లింగాల జానకంపల్లి ఖుర్దు, గ్రామ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధిహామీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నక్క గంగాధర్, ఎస్ఎన్‌రెడ్డి, నాయకులు సాయిలు, అమర్‌నాథ్, సుభాష్, సాయిలు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో దేశం ఆర్థికాభివృద్ధి సాధించింది..

బీర్కూర్: కేంద్ర బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశం ఎంతగానో ఆర్థికాభివృద్ధి సాధించిందని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ గార్గే అన్నారు. మంగళవారం ఆయన బీర్కూర్ మండలం బైరాపూర్, బస్వాపూర్ గ్రామాలలో పర్యటించారు. ఆయన ఉపాధిహామీ కూలీలతో మమేకమయ్యారు. ప్రజలు బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా నాయకురాలు సుగుణ, సీనియర్ నాయకులు అర్సపల్లి సాయిరెడ్డి, దావుగారి దాకయ్య, ముత్యాల సాయిబాబా, చీకట్ల రాజు, రాజాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి'

ఎల్లారెడ్డి, మే 7: ఎల్లారెడ్డి అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గుండి మాసానిపేట్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి చెందడానికి నిధులు వస్తాయని పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, విద్యాసాగర్, శంకర్, సతీష్, షేకావత్ అలీ, గఫర్ తదితరులు పాల్గొన్నారు.


గుజ్జరి జగదీష్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎల్లారెడ్డి, మే 7: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కళ్యాణి గ్రామానికి చెందిన గుజ్జరి జగదీష్ (30) ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో హోటల్ నిర్వహిస్తాడు. ఈనెల గురువారం ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం కామారెడ్డి వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి సాయంత్రం ఎల్లారెడ్డికి వస్తుండగా లింగంపేట్ మండలంలోని ముస్తాపూర్ గేట్ సమీపంలోని మూలమలుపు వద్ద పంది అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో తలకు గట్టి గాయలు కావడంతో కోమాల్లోకి వెళ్లాడు. స్థానికులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స కోసం కామారెడ్డి ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ కూతురు ఉన్నారు.

రైతునగర్‌లో వ్యక్తి ఆత్మహత్యా యత్నం

బీర్కూర్, మే 7: మండలంలోని రైతునగర్ గ్రామానికి చెందిన మేదరి సాయిలు అనే వ్యక్తి సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సాయిలు మద్యానికి బానిసయ్యాడు. నిత్యం భార్యతో గొడవ పడుతూ ఉండేవాడని స్థానికులు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఒక పార్టీ తరఫున ప్రచారం చేస్తున్నాడు. పార్టీ తరఫున ఇస్తున్న మద్యం తాగి రాత్రి ఇంటికి వచ్చాడు. ఈ విషయమై భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. అర్ధరాత్రి గుర్తు తెలియని మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సాయిలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్	- మనజుమిల్ బాయ్స్
శాంతి	- టిల్లు స్క్వేర్
ప్రియా 70	- ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	- గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

మహేశ్వరి	- ఆ ఒక్కటి అడక్కు
వెంకటేశ్వర	- ప్రసన్న వదనం



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

